క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కాకినాడ సిటీ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. కాకినాడ శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ కార్యాలయం ఫోన్ నంబర్ 0884–2357800కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

ఆహార పదార్థాల వృథా తగదు



ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: ఆహార పదార్థాలను వృథా చేయరాదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఐ.ప్రసాద్‌నాయుడు అన్నారు. రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ ఆహార నష్టం, వ్యర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలను ఉత్పత్తి చేయడానికి రైతులు ఎంతో కష్టపడి పండిస్తారన్నారు. రోజురోజుకూ శుభాశుభ కార్యాల్లో టన్నుల కొద్దీ ఆహారం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలు మిగిలిపోతే, స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలకు సమాచారమిస్తే.. వారు ఆకలితో ఉన్నవారికి అందజేస్తారని తెలిపారు. అనంతరం పలువురికి ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుబ్బల లక్ష్మణప్రసాద్, అడబాల రత్నప్రసాద్, బుద్ధ సత్యన్నారాయణరాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఎస్.శ్రీనగేష్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బుల నివారణపై అవగాహన

కాకినాడ రూరల్: గుండె జబ్బుల నివారణపై మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ మెడికవర్ ఆసుపత్రి వద్ద ఆదివారం ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు ఆర్‌డీ నాయక్ మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలిలో భాగంగా గుండె సంబంధిత వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్ పేరుకుపోడం గుండె జబ్బులకు ప్రధాన కారణమన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట సేపు వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

ఉచిత గుండె పరీక్షలు

కాకినాడ రూరల్: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని నగరంలోని టీమ్ ఆస్పత్రి, మాధవపట్నం జంక్షన్ వద్ద సూర్యగ్లోబల్ ఆస్పత్రి సంయుక్తాధ్వర్యంలో జర్నలిస్టులకు ఆదివారం ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. సూర్య గ్లోబల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని, అవగాహన ర్యాలీని ఆస్పత్రి అధినేత బీవీపీఎస్ వీర్రాజు ప్రారంభించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ యు.ఆదినారాయణ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, సమతుల్యమైన ఆహారం తీసుకుంటూ ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. బీపీ, సుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. మరో కార్డియాలజిస్ట్ ఎస్.ఎన్.పాండా పలు విషయాలపై అవగాహన కల్పించారు.

ఎస్‌ఎఫ్‌ఐ నూతన గరల్స్ కమిటీ ఎన్నిక

కాకినాడ సిటీ: ఎస్‌ఎఫ్‌ఐ కాకినాడ జిల్లా గరల్స్ నూతన కమిటీని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం గంగాసూరిబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా జి చిన్ని, కో–కన్వీనర్లుగా అమృత, బిందు, కావ్య, సభ్యులుగా హేమ, మంజుల, మల్లేశ్వరి, శివమణి, హేమ ఎన్నికయ్యారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఈ కమిటీ కృషి చేస్తుందని వరహాలు, గంగాసూరిబాబు తెలిపారు. ఈవ్‌టీజింగ్, స్వీయ రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామని నూతన కమిటీ పేర్కొంది.

జూదరుల అరెస్టు

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి మహాలక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఇంద్రపాలెం పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. ఎస్సై ఎం.వీరబాబు వివరాల మేరకు, మహాలక్ష్మీనగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పట్టుబడగా, వారి నుంచి రూ.65,400, ఐదు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, సత్య సుందరం, 35
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, సత్య సుందరం, 35
లక్ష్మి:	దేవర పార్ట్–1
సత్యగౌరి:	దేవర పార్ట్–1
తిరుమల:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ1:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ2:	దేవర పార్ట్–1
శ్రీప్రియ:	దేవర పార్ట్–1
పద్మప్రియ:	దేవర పార్ట్–1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్–1
సూర్య2:	దేవర పార్ట్–1

ఈ నగరానికి ఏమైంది..!

- దుర్గంధ భరితంగా సాగర తీర నగరం
- చెత్త సమస్యతో కాకినాడ ప్రజలు సతమతం
- కానరాని తడి–పొడి చెత్త సేకరణ
- ఒకప్పుడు దేశంలోనే రెండో స్థానం
- ఇప్పుడు మురికి కూపంగా దిగజారుతున్న వైనం



చెత్త సేకరణ జరగకపోవడంతో అపార్ట్‌మెంట్ల వద్ద ట్రాక్టర్లలో చెత్తను తరలిస్తున్న ప్రజలు

కాకినాడ: పారిశుధ్య నిర్వహణలో ఒకప్పుడు దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన సాగర తీర నగరమిది. పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వెరసి ఈ నగరాన్ని మురికి కూపంగా మారుస్తున్నాయి. చెత్త సేకరణలో ఎదురవుతోన్న అవాంతరం ప్రజలకు రోజురోజుకూ నరకప్రాయంగా మారుతోంది. ఇంటింటికీ చెత్త సేకరణలో ఒకప్పుడు దేశంలోనే రెండో స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ తాజాగా అథఃపాతాళానికి దిగజారుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన హూపర్, టిప్పర్ వాహనాలను కొత్త ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లించకపోవడంతో.. వీటి నిర్వహణ నగరపాలక సంస్థకు భారంగా మారింది. దీంతో ఆ వాహనాలన్నీ మూలన పడ్డాయి. అప్పట్లో సుమారు 100 వాహనాలు సిబ్బందితో సహా ఇంటింటికీ వెళ్లి, తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేవారు. దీనిని డంపింగ్ యార్డుకు తరలించే ప్రక్రియ సమర్థంగా సాగేది. అయితే యూజర్ చార్జీల నెపంతో సదరు వాహన కాంట్రాక్టర్‌కు సొమ్ము చెల్లించకపోవడంతో, వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా సుమారు నెల రోజులుగా చెత్త సేకరణ పారిశుధ్య విభాగానికి పెద్ద తలనొప్పిగా మారింది.

నగరపాలక సంస్థకు శిరోభారం

ఇంటింటికీ చెత్త సేకరణ నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగానికి పెను సవాల్‌గా మారింది. హూపర్ టిప్పర్ వాహనాలు లేని కారణంగా ప్రస్తుతం పుష్‌కార్ట్‌ల ద్వారానే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. పైగా తడి–పొడి చెత్తను వేర్వేరుగా తీసుకోవడం కూడా సదరు పుష్‌కార్ట్‌లకు సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. ఆ చిన్న తోపుడు బండ్లపై సేకరించే చెత్తను ప్రోసెసింగ్ కేంద్రానికి తరలించే విధానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

క్షీణిస్తున్న పారిశుధ్యం

చెత్తసేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు వల్ల నగరంలో పారిశుధ్య సమస్య రోజురోజుకూ క్షీణిస్తోంది. వాహనాలు రాని నేపథ్యంలో ప్రజలు పాత విధానాలను పక్కన పెట్టి, చెత్తను రోడ్లపైన, డ్రైనేజీలలోను, సమీపంలోని ఖాళీ స్థలాల్లో వేసేస్తున్నారు. దీంతో అనేక ప్రాంతాలు దుర్వాసన, దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. మరోవైపు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏ సమయంలో, ఎటువంటి రోగాలు సంభవిస్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇంటింటికీ చెత్త సేకరణలో బహుళ అంతస్తుల భవనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శ ఉంది. ఇటీవల 41వ డివిజన్‌లో ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో, అక్కడి మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్ సొంతంగా ఒక ట్రాక్టర్‌ను సమకూర్చి అపార్ట్‌మెంట్లలోని చెత్తను తరలించాల్సి వచ్చింది.

స్పందించని అధికారులు, నేతలు

సమస్య తీవ్రతపై ఇక్కడి ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ ఏ మాత్రం స్పందించని పరిస్థితి కనిపిస్తోంది. నెల రోజులుగా 'చెత్త' సమస్యతో జనం అల్లాడుతున్నా, పారిశుధ్య నిర్వహణను మొక్కుబడి తంతుగా కానిచ్చేస్తున్నారు. హూపర్ టిప్పర్ వాహనాలకు చెల్లించాల్సిన రూ.3.5 కోట్ల బకాయిల భారాన్ని కూడా ప్రభుత్వం కార్పొరేషన్లే భరించాలన్న ఉత్తర్వుల నేపథ్యంలో ఆ దిశగా నగరపాలక సంస్థ బకాయిలు ఇచ్చేందుకు ముందుకు వచ్చినప్పటికీ, సాంకేతిక పరమైన అవరోధాలతో జాప్యం జరుగుతోంది. మొత్తం మీద చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు దొరుకుతుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

త్వరలో బకాయిల చెల్లింపు



ప్రభుత్వ ఆదేశాల మేరకు హూపర్ టిప్పర్ వాహనాలను త్వరలోనే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన రూ.3.5 కోట్ల సొమ్ము విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే అతి త్వరలోనే హూపర్ టిప్పర్ వాహనాలు వినియోగంలోకి వస్తాయి. పారిశుధ్య సమస్య పరిష్కారం అవుతుంది.

– డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, కాకినాడ

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ డి4 సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ స్థానిక ఈఈ ఉదయభాస్కర్ కోరారు. శశికాంత్ నగర్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో, 11 కేవీ శశికాంత్ నగర్ ఫీడర్ పరిధిలోని కృష్ణానగర్ బ్యాంక్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, సౌజన్యనగర్, శశికాంత్ నగర్, ఆర్‌ఆర్ నగర్, త్యాగరాజనగర్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే వలసపాకల సబ్ స్టేషన్ పరిధిలోని కోరమాండల్ రోడ్డు, వీర్రాజు హాస్పటల్ ఏరియా, పంచాయతీ ఆఫీసు ఏరియా, వలసపాకల సెంటరు, కాకినాడ పబ్లిక్ స్కూల్, విద్యానగర్, పీఎంఆర్ ఐస్ ఫ్యాక్టరీ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

బొజ్జా విజయభారతికి నివాళి

బోట్‌క్లబ్: ప్రముఖ రచయిత్రి, సామాజిక ఉద్యమయోధులు బొజ్జా విజయభారతి జీవితం సమాజ అభ్యుదయ ప్రగతికి ఆదర్శప్రాయమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బొజ్జా విజయభారతి సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధ సిద్ధాంతవేత్త అయితాబత్తుల రామేశ్వరరావు, డాక్టర్ మానుమతి తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లో చెత్త తొలగింపు



బీచ్‌లో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ కేజీ డి6 గాడిమొగ సిబ్బంది మండలంలోని సూర్యారావుపేట ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌ను ఆదివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది, రిలయన్స్ లేడీస్ క్లబ్ సభ్యులు, కుటుంబ సభ్యులు సుమారు 350 మంది పాల్గొని 2.5 కిలోమీటర్ల మేర శుభ్రపరిచారు. రెండు టన్నుల చెత్తను తొలగించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఆపరేషన్స్ హెడ్ నందగిరి, హెచ్‌ఆర్ హెడ్ జి.శ్రీనివాసరావు, హెచ్ ఆర్ టీమ్ సీహెచ్ భాస్కరరావు, కె.శివప్రసాద్, సీఎస్‌ఆర్ హెడ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దేవుడి కోనేరులో చేపలు మాయం

- సర్పవరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపల పట్టివేత
- చోద్యం చూస్తున్న దేవదాయ శాఖ అధికారులు



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం ఎదుట ముక్తికా సరస్సు(కోనేరు)

కాకినాడ రూరల్: రాజకీయ నాయకులకు తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ అధికారులు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలోని భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ముక్తికా సరస్సుగా పిలిచే కోనేరులోని చేపలు పట్టి ఆదివారం తెల్లవారుజామున విక్రయాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కోనేరులో భక్తులు స్నానాలు చేస్తుంటారు. సహజసిద్ధంగా పెరిగే చేపలు పట్ట కూడదు. ఇటీవల రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ గ్రామంలోని జనసేన నాయకులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీ నాయకులు కావడంతో, అధికారులు వారికి ఎదురు చెప్పడం లేదు. ఇదే కోనేరు పక్కన ఉన్న చెరువులో చేపల పెంపకానికి వేలం పాట ద్వారా ఆదాయం పొందుతున్నారు. గత ప్రభుత్వంలో వేలం పాట ద్వారా చెరువులో చేపల పొందిన వ్యక్తిని సొమ్ము కట్టడం లేదనే నెపంతో పక్కన పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా, మరలా వేలంపాట నిర్వహించకుండానే ఆ గ్రామ జనసేన నేతల సిఫారసుతో చెరువులో చేపల పెంపకం ఇంకొకరికి ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఆ చెరువులోని చేపలను పట్టుకుని విక్రయించారు. చేపల ద్వారా సుమారు రూ.1.20 లక్షల ఆదాయం లభించిందని గ్రామస్తులు చెబుతుండగా, ఆలయ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు ఉన్నారు. దీనిపై ఈఓ భీమశంకరరావును వివరణ కోరగా, కోనేరు శుభ్రం చేస్తున్నారని, అందులో చేపలు పట్టలేదని తెలిపారు. పక్కనే ఉన్న చెరువు వేలం పాట లీజుదారుడు లీజు సొమ్ము కట్టకపోవడంతో వేరొకరికి అవకాశం ఇచ్చామన్నారు. ఆ ఈవో ఇటీవలే కోటిపల్లి ఆలయానికి బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన ఈఓకు బాధ్యతలు అప్పగించకపోడంతో, ఆయనే కొనసాగుతున్నారు. దేవుడి ఆదాయానికి గండి కొడుతూ, సొంత ప్రయోజనాలు చూసుకుంటున్న నేతలపై విమర్శలు వెల్లువెతున్నాయి.

నష్టపోయిన మసీదులకు ఆర్థిక సాయం



మసీదు బాధ్యులకు చెక్కును అందజేస్తున్న ముస్లిం పెద్దలు

కాకినాడ సిటీ: విజయవాడ వరదల్లో నష్టపోయిన మసీదులు, మదరసాలను ఆర్థికంగా ఆదుకునేందుకు వీలుగా నగరంలోని వివిధ మసీదుల వారు రూ.1,02,100 వసూలు చేశారు. ఈ నగదును ముస్లిం పెద్దలు ఆదివారం విజయవాడ వెళ్లి అక్కడున్న మసీదుల బాధ్యులకు అందజేశారు. విజయవాడ వరదల్లో నష్టపోయిన మసీదులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో గత వారంలో కాకినాడ జామియా, మదీనా, హబీబియా, మక్కా మసీదులు, మస్జిద్ ఏ అజంకు చెందిన వారు, ప్రముఖులతో పాటు, నూర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత బషీర్ ద్వారా విరాళాలు వసూలు చేశారు. ఈ సొమ్మును ఆయా మసీదుల ప్రతినిధులు ఎస్ ఏజాజుద్దీన్, ఎండీ ఖతుబుద్దీన్, అబ్దుల్ బషీరుద్దీన్, ఎండీ సిద్దిక్ అలీఖాన్ బృందం విజయవాడ వెళ్లి, మూడు మసీదులు, ఓ ఉర్దూ అరబిక్ బాలికా మదరసాకు ఆర్థిక తోడ్పాటు అందించారు. విజయవాడలోని ఖంద్రికలోని హబీబి మసీదుకు రూ.25 వేలు, రామకృష్ణాపురంలోని బిలాల్ మసీదుకు రూ.20 వేలు, పులిపాకలోని కృష్ణానది గట్టున ఉన్న మస్జీద్ ఎ హలిమాకు రూ.27 వేలు, పాత ఆర్‌ఆర్‌పేటలోని జామియా ఫైజాన్ ఏ ఫాతిమా బాలికా మదరసాకు రూ.30,100 అందించినట్లు వారు వివరించారు.

వృక్ష సంపదతో జీవన మనుగడ



సర్పవరంలో మొక్కలు నాటుతున్న సభ్యులు

కాకినాడ రూరల్: మానవ మనుగడ కోసం వృక్ష సంపదను కాపాడుకోవాలని, తద్వారా సర్వజీవుల జీవన విధానం మెరుగుపడుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ అన్నారు. సర్పవరం జంక్షన్‌లోని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ, వృక్షాలను దేవతలుగా పూజించి, ఆరాధించే దేశంలో వృక్ష సంపద రోజురోజుకూ తరగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది సంవత్సరాలు జీవిస్తూ, ఎంతో దూరం ఆక్సిజన్ అందించే శక్తి మహా వృక్షాలకు ఉందన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ విశ్రాంత జనరల్ మేనేజర్ ఇందుగుల ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి అక్టోబర్ ఒకటి వరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ టీచర్స్ క్రికెట్ లీగ్ విజేత పిఠాపురం

పిఠాపురం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా గొల్లప్రోలులో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో కాకినాడ జిల్లా స్థాయి యునైటెడ్ టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, పెదపూడి. జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాలకు సంబంధించి జట్లు పోటీల్లో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్‌లో పిఠాపురం, కాకినాడ సిటీ జట్లు తలపడగా, పిఠాపురం విజేతగా నిలిచింది. అక్టోబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుంది. ఈ పోటీలను యూటీఎఫ్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి చక్రవర్తి, అధ్యక్షుడు నగేష్ ప్రారంభించారు.




గ్రామ వీధిలో బిందెలతో నీరు తీసుకెళుతున్న మహిళలు



గోళీలాడుతున్న చిన్నారులు

బతుకు భారతం

- బొమ్మల్లో ఉట్టిపడిన జీవకళ
- ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్



దేశంలోని వివిధ సంప్రదాయాలను ప్రతిబింబించేలా..



మహిళల వివిధ పాత్రలు



సంక్రాంతి పండగకు హరిదాసుకు బియ్యం వేస్తూ..



గడ్డిమోపు నెత్తిన పట్టుకుని వెళ్తున్న యువతి



పొలంలో నాట్లు వేస్తున్న రైతులు



ఆవు పాలు పితుకుతున్న మహిళ

బోట్‌క్లబ్: గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా చిత్రకారులు వేసిన అపురూప వర్ణ చిత్రాలు నగర ప్రజలను కట్టిపడేశాయి. పల్లెటూరిలో అమ్మాయి ఎండుగడ్డి మోపు నెత్తిన పెట్టుకుని వెళుతున్నట్టు, మత్స్యకారులు గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద చేపలు అమ్ముతున్నట్టు, రైతు పొలం దున్నుతున్నట్టు, మహిళ తన ఇంటి వద్ద ఆవుకు పాలు పితుకుతున్నట్టు, గ్రామీణ ప్రాంతంలో మహిళలు బిందెలతో చెరువుల నుంచి నీరు తీసుకెళుతున్నట్టు, సంక్రాంతి పండగ వేళ హరిదాసుకు బియ్యం వేస్తున్న చిన్నారి.. ఇలా చిత్రకారులు తమ ప్రతిభకు అద్దం పడుతూ గీసిన చిత్రాలు ఈ ప్రదర్శనలో చూపరుల మనస్సులు హత్తుకున్నాయి. క్రియేటివ్ ఆర్ట్స్ ఆకాడమీ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఈ చిత్రకళా ప్రదర్శన స్థానిక ఎల్‌బీనగర్‌లోని ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ ప్రదర్శనను నటుడు ఆకొండి సూర్య ప్రారంభించారు. గ్రామీణ భారతం అనే అంశంపై నిర్వహించిన ఈ చిత్రకళా ప్రదర్శనలో 35 మంది కళాకారుల చిత్రాలు ఈ ప్రదర్శనలో ఉంచారు. చిత్రకారులను ప్రోత్సహించేందుకు, నూతనంగా చిత్రలేఖనంపై ఆసక్తి పెంచేందుకు ఏలూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డి.మధుసూదనరావు వాటర్ కలర్స్ ఎలా ల్యాండ్ స్కేప్ చేయాలో స్వయంగా చూపించారు. అనంతరం చిత్ర ప్రదర్శనలో పాల్గొన్న చిత్రకారులకు అకాడమీ వ్యవస్థాపకుడు అంజి బహుమతులు అందించారు. సుమారు 800 మంది ఈ ప్రదర్శనను తిలకించారు.